సాక్షి నల్లగొండ

గురువారం । 23 । జనవరి । 2025



సీఎం రేవంత్ నిర్లక్ష్యంతోనే..
సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్ర బలగాల చేతిలోకి వెళ్లిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. - 8లో



జన్మతః పౌరసత్వం రద్దుపై..
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంపై అక్కడ ఉంటున్న ఉమ్మడి జిల్లా వాసుల్లో ఆందోళన నెలకొంది. - 8లో



అగ్ర స్థానంలో నిలపాలి
దేవరకొండ ఆర్టీసీ డిపోను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్ స్థానంలో నిలపాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. - 8లో

సైబర్ వల.. చిక్కితే గుల్ల!

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌తో నష్టపోతున్న ప్రజలు

- నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్ నంబర్లు ఇస్తున్న పేదలు
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఈ 20 రోజుల్లోనే 70కి పైగా కేసులు నమోదు
- ఏపీకే ఫైల్స్, ఫేస్‌బుక్ రిక్వెస్ట్‌లతోనూ మోసాలు

నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యాపారి డబ్బులు ఎక్కువగా వస్తాయనే ఆశతో ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో మొదట రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. రూ.2 లక్షలు రావడంతో మళ్లీ పెట్టుబడి పెట్టాడు. ఇలా క్రమంగా పెంచుకుంటూ రూ.1.98 కోట్లు ఇన్వెస్టిమెంట్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత విత్‌డ్రా ఆప్షన్ తొలగించారు. దీంతో సదరు వ్యాపారి లబోదిబోమంటూ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, రూ.55 లక్షలు మోసగాళ్లు విత్‌డ్రా చేయకుండా ఆపగలిగారు.

నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు రూ.3 కోట్లు పెట్టుబడి పెట్టి మోసపోయారు. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూ.80 లక్షలను సైబర్ నేరగాళ్లు డ్రా చేయకుండా అకౌంట్‌ను ఫ్రీజ్ చేయగలిగారు. ఆ మొత్తాన్ని కోర్టు ద్వారా బాధితులకు ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇంట్లో ఉండే లక్షలు సంపాదించవచ్చంటూ..

ఇంట్లో ఉండే డబ్బులు సంపాదించవచ్చని.. రూ.వేలల్లో పెడితే రూ.లక్షల్లో వస్తాయని.. రూ.2200 పెట్టుబడి పెట్టి రూ.2.60 లక్షలు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి ఇటీవల నల్లగొండలో ఓ మహిళ పెట్టుబడి పెట్టి మోసపోయారు. దీంతో ఆమె సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో జనం ఇన్వెస్ట్‌మెంట్ యాప్ వంటి సైబర్ మోసాల బారిన పడుతున్నారు. వీరిలో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు, డాక్టర్లు, ఇంజనీర్లు ఉన్నారు. ఏమీ తెలియని అమాయకులకు తమ బ్యాంకు అకౌంట్లకు సైబర్ నేరగాళ్ల ఫోన్‌నెంబర్లను లింక్ చేయించి ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్న ఆశ చూపి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో పెద్ద ఎత్తున సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఎంత అవగాహన కల్పించినా మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

20 రోజుల్లోనే 70 కేసులు..

సైబర్ నేరాలు జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్నాయి. జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో 70 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 1,672 సైబర్ మోసాల కేసులు నమోదు కాగా, 2023లో 1174 మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోయారు. జిల్లాలో రోజుకు సగటున నాలుగైదు సైబర్ మోసాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇన్వెస్టిమెంట్ కేసులే అధికం..

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు జిల్లాలో ఎక్కువ మంది నష్టపోతున్నారు. అమెరికన్ సెంచురీ యాప్ తరహాలో డూప్లికేట్ యాప్ తయారు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసి మోసం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. పెట్టుబడి పెట్టిన వారితో టెలిగ్రామ్ లేదా వాట్సప్‌లో ఒక గ్రూపు రూపొందించి అందులో మోసగాళ్లకు సంబంధించిన వారే వంద మంది వరకు ఉండి, పెట్టుబడి పెట్టేలా ఆకర్షణకు గురయ్యేలా చేస్తారు. ఆ గ్రూపులో ఒకరు నేను రూ.10 వేలు పెట్టుబడి పెడితే రూ.4 లక్షలు వచ్చాయని, మరొకరు రూ.లక్ష పెడితే రూ.10 లక్షలు వచ్చాయని, ఇంకొందరు అందులో వచ్చిన డబ్బుతో కారు కొన్నానని, ఇల్లు కొన్నానంటూ డిస్కస్ చేస్తూ బాధితులు ఆకర్షితులై పెట్టుబడి పెట్టేలా చేస్తారు. వారికి మొదటిసారి డబ్బులు పంపిస్తారు. దీంతో లాభాలొస్తున్నాయని మళ్లీ పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాక విత్‌డ్రా ఆప్షన్‌ను డిసేబుల్ చేస్తారు. ఇలా బాధితులు ఎక్కువ సంఖ్యలో మోసపోతున్నారు.



ఈ–బైక్ పేరుతో మోసం...

ఈ–బైక్‌ల పేరుతోనూ సైబర్ నేరగాళ్లు ఈ మోసం చేస్తునారు. మీరు రూ.10 వేలు కడితే మీకు ఈ–బైక్ వస్తుందని, అయితే అందుకు మరొక ఐదుగురితో కట్టించాలని, అలాగే వారికి ఈ–బైక్‌లు వస్తాయని, ఇలా చైన్ సిస్టమ్ వ్యాపారంలో భారీగా మోసం చేస్తున్నారు. ముందుగా ఒకరిద్దరికి ఇచ్చి, ఆ తరువాత అనేక మంది చేరాక ఆ వెబ్‌సైట్ లేదా యాప్‌నే క్లోజ్ చేసి మోసం చేస్తున్నారు. మరోవైపు అమ్మాయిలకు ఫేస్‌బుక్ రిక్వెస్ట్‌లు పెట్టి, చాటింగ్ చేస్తున్నారు. అత్యవసరం ఉందని డబ్బులు అడగటం, ఇవ్వకపోతే మార్ఫింగ్ చేసిన మీ న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతూ మోసం చేస్తున్న కేసులు నమోదవుతున్నాయి.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. మోసం జరిగిందని గ్రహించిన వెంటనే ఫిర్యాదు చేయాలి. అలాంటి చేసిన కేసుల్లో డబ్బు డ్రా చేయనంత వరకు అకౌంట్లలో ఉన్న దానిని ఫ్రీజ్ చేయిస్తున్నాం. అలా ఫ్రీజ్ చేసిన రూ.1.25 కోట్లను గత ఏడాది 110 మంది బాధితులకు ఇప్పించగలిగాం.

– ఎస్పీ శరత్‌చంద్రపవార్

మనది కాని సొమ్ముకు ఆశ పడొద్దు



మనది కాని డబ్బు మనకు రాదని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆన్‌లైన్‌లో వచ్చే ఏ సైట్‌లను కూడా ఓపెన్ చేయవద్దు. ఆన్‌లైన్‌లో మోసపోతే వెంటనే 1093 నంబర్‌కు ఫోన్ చేయాలి. లేదంటే నేషనల్ క్రైం రికార్డ్స్ పోర్టల్‌లో రిపోర్ట్ చేయాలి.

– సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

డిజిటల్ అరెస్టుల పేరిట మోసాలు..

డిజిటల్ అరెస్టుల పేరుతోనూ మోసాలు చేస్తున్నారు. తాము కస్టమ్స్, బీబీఐ, సీఐడీ, ఏసీబీ అధికారులమని, మీరు అక్రమంగా సంపాదిస్తున్నారని చెప్పి, మిమ్మల్ని అరెస్ట్ చేస్తామంటూ ఒకరు ఫోన్‌లో చెబుతారు. ఆ పక్కనే మరో మోసగాడు ఆయన అలాంటి వారు కాదు సర్.. మీరు ఆగండి నేను మాట్లాడతాను.. అంటూ బాధితుడికి ఫోన్ చేస్తారు. మీరు డబ్బు పంపితే మిమ్మల్ని అరెస్టు చేయకుండా చూస్తానని, లేదంటే మీ ఇష్టం అంటూ బెదిరిస్తుండటంతో అమాయకులు రూ.లక్షలు కోల్పోతున్నారు. మిర్యాలగూడలో ఓ డాక్టర్ ఇలాగే భారీ మొత్తంలో డబ్బును కోల్పోయారు.



అద్దె అకౌంట్ల ద్వారా మోసం..

నల్లగొండ, హాలియా, మిర్యాలగూడ ప్రాంతాల్లో అద్దె అకౌంట్ల మోసాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మీకు లోన్ మంజూరైంది ఫలానా బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయండి.. మీకు రూ.10 వేలు వస్తాయి.. మళ్లీ చెల్లించాల్సిన అవసరం లేదు అని చెప్పడంతో ఆశతో కొందరు అకౌంట్లు ఓపెన్ చేస్తున్నారు. ఈ క్రమంలో తమ ఫోన్ నంబర్ ఆధారంగానే అకౌంట్ ఓపెన్ చేసినా, సైబర్ నేరగాళ్ల మాయమాటలు విని ఆన్‌లైన్ అకౌంట్‌కు, ఎస్‌ఎంఎస్ ఆప్షన్‌కు సైబర్ నేరగాళ్ల ఫోన్ నంబర్‌ను ఇచ్చేస్తున్నారు. ఇలాంటి అకౌంట్లకే తాము మోసం చేసి రాబట్టుకున్న డబ్బును తరలించి విత్ డ్రా చేస్తున్నారు. అంతేకాదు డాట్ ఏపీకే ఫైల్స్ పంపి దానిని ఓపెన్‌చేసి ఫోన్ హ్యాక్ చేసి అకౌంట్లలో డబ్బును కాజేస్తున్నారు.



న్యూస్‌రీల్

ఎంజీయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

నల్లగొండ టూటౌన్ : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫలితాలను వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ బుధవారం విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్‌లో 6,300 మంది విద్యార్థులకు 1,338 మంది, మూడవ సెమిస్టర్‌లో 4,509 మందికి 1,569 మంది, ఐదవ సెమిస్టర్‌లో 5,378 మందికి 2,380 మంది ఉత్తీర్ణత సాధించినట్లు సీఓజీ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలువాల రవి, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ లక్ష్మీ ప్రభ, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ రామచంద్రగౌడ్, డాక్టర్ ప్రవళిక, కోఆర్డినేటర్ డాక్టర్ భిక్షమయ్య పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో డైరెక్టర్ రాత్రి బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డైరెక్టర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల ఆశ్రమ పాఠశాలను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకులాల డైరెక్టర్ కె.లక్ష్మి బుధవారం సందర్శించారు. పాఠశాలలో వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. రాత్రి పాఠశాలలోనే నిద్ర చేశారు. ఆమెకు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ పాండుగౌడ్, తహసీల్దారు హరిబాబు, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి స్వాగతం పలికారు.

పేదలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేదలకు వర్తింపజేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వాడపల్లితోపాటు పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ కొత్తగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లగొండ : మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,360 సీట్లున్నాయని తెలిపారు. 4వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఫిబ్రవరి1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు.

స్కాలర్‌షిప్పుల దరఖాస్తులు పంపాలి

నల్లగొండ : జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో బీసీ, ఈబీసీ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరుకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయానికి పంపాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఖాజానాజీమ్‌అలీ అప్సర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు పంపకపోతే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేయని బీసీ, ఈబీసీ విద్యార్థులు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నల్లగొండ టూటౌన్ : రైతుల కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో ఈనెల 28వ తేదీన నిర్వహించే రైతు మహాధర్నాకు ఉమ్మడి జిల్లాలోని రైతులు, ప్రజలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని నల్లగొండ, సాగర్ మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్ కోరారు. బుధవారం నల్లగొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ అంటేనే సీఎం, మంత్రులు భయపడుతున్నారని, రైతు ధర్నాకు అనుమతి ఇవ్వకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకున్నారని ఆరోపించారు. రైతుబంధు, రైతు రుణమాఫీ ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరపున కేటీఆర్ ప్రశ్నిస్తానంటేనే సీఎం, మంత్రులు ఉలిక్కి పడుతున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని గ్రామసభల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారని, పథకాలు ఎగ్గొట్టడానికే ప్రభుత్వం ఎత్తులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో పల్లె రవికుమార్, దుదిమెట్ల బాలరాజు, రాజీవ్‌సాగర్ బొర్ర సుధాకర్, వంగాల సహదేవరెడ్డి, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రి, కరీంపాషా, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు హైకోర్టు అనుమతి

నల్లగొండ టూటౌన్ : బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో ఈనెల 28వ తేదీన రైతు మహాధర్నా నిర్వహించుకోవడానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈనెల 21వ తేదీన రైతు ధర్నా చేయడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు ఈనెల 28న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు ధర్నా నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతు మహాధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నందున పార్టీ నేతలు భారీగా జనం తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తన పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులు, వారికి సహకరించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రామచంద్రునాయక్, పల్లె రవికుమార్, దుదిమెట్ల బాలరాజుయాదవ్, రాజీవ్‌సాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- కోమటిరెడ్డి బ్రదర్స్ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్స్
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భాష మార్చుకోవాలి
- అధికారంలో ఉన్నప్పుడు జగదీష్‌రెడ్డి చేసింది ఏమీలేదు
- కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి లేదన్నారు. ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయాల్సి ఉండగా.. బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం గుండాలు, గంజాయి బ్యాచ్‌తో మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లి దౌర్జన్యం చేశారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాలో ఫ్లోరైడ్ విముక్తి కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశాడని, జాతీయ రహదారి ఆరు లైన్లుగా విస్తరణ పనులు మంజూరు చేయించిన ఘనత కూడా ఆయనదేనని అన్నారు. పది సంవత్సరాలు మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి కోమటిరెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయించారని చెప్పారు. అభివృద్ధికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బ్రదర్స్ బ్రాండ్ అంబాసిడర్స్ అని వారు స్పష్టం చేశారు. నల్లగొండ మున్సిపాలిటీలోని 16 వార్డులలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయని, మంత్రి కోమటిరెడ్డి నల్లగొండ నియోజకవర్గంలో 8 సబ్ స్టేషన్లు మంజూరు చేయించి పనులు చేపట్టారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసమే మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆ పార్టీ నాయకుల మెప్పుపొందాలని చూస్తున్నాడని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డిపై ఆరోపణలు చేస్తే ఇక చూస్తూ ఊరుకోమని, తమదైన శైలిలో గుణపాఠం చెబుతామన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు బషీరుద్దీన్, మారగోని నవీన్‌గౌడ్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, గణేష్ శ్రీనివాస్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, గోవర్ధనాచారి, వజ్జ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

• నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు



విద్యుత్ వెలుగుల్లో పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : భారతీయ వాయుసేన.. అగ్నిపథ్ స్కీం కింద అగ్నివీర్ వాయు మెడికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమో, బీఎస్సీ ఫార్మసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

లిఫ్టు నిర్మాణానికి అదనంగా రూ.100కోట్లు

పాలకవీడు: పాలకవీడు మండల పరిధిలోని జాన్‌పహాడ్ శివారులో కృష్ణానదిపై రూ.173 కోట్లతో నిర్మాణంలో ఉన్న జవహర్ జాన్‌పహాడ్ లిఫ్టు నిర్మాణానికి అదనంగా రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. జాన్‌పహాడ్ లిఫ్టు నిర్మాణంపై మంగళవారం రాత్రి హైదరాబాద్ సచివాలయంలో నీటి పారుదలశాఖ, అధికారులు, పాలకవీడు మండల నాయకులతో సమీక్షించి మాట్లాడారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగొద్దు

- టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ భిక్షపతి

నల్లగొండ : ఎండాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని.. కరెంట్ కోతలతో రైతులు రోడ్డెక్కితే డీఈ, ఎస్‌ఈలే వహించాల్సి ఉంటుందని టీజీఎస్‌పీడీసీఎల్ కమర్షియల్ సీఈ పి.భిక్షపతి అన్నారు. బుధవారం నల్లగొండ ఎస్‌ఈ కార్యాలయంలో ఏడీఈలు, డీఈలు, ఎస్‌ఈలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11కేవీ, 33కేవీ, ఫీడర్లు, పీటీఆర్‌లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సమ్మర్‌లో పంట పొలాలు కోతలు ఉంటాయని.. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. అవసరమైన మెటీరియల్ వెంటనే తెప్పించుకుని బిగించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఈ భిక్షపతి


ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నకిరేకల్ మండలం ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారంథామె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగుల వివరాలు, అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులకు ప్రతి నెలా చికిత్సలు అందించే ఏఎన్‌సీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జీరో డెలవరీలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు హాజరవుతున్నారా.. లేదా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి పేదలు ఎక్కువగా వస్తారని వారికి సరైన వైద సేవలందించాలని సూచించారు. ఎలాంటి సమస్య లేకున్నా.. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన రోగులను కావాలని ప్రైవేట్ ఆస్పత్రులకు పంపినట్లు తమ దృష్టికి వస్తే ప్రభుత్వ డాక్టర్లు వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట తహసీల్దార్ జమీరుద్దీన్, మండల వైద్యాధికారి యోగస్వీ, నర్సింహాచారి ఉన్నారు.

బోగస్ జాబితాలను నమ్మొద్దు

నల్లగొండ : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల జాబితా అంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న బోగస్ జాబితాలను ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు ఎలాంటి అనుమతి పొందిన జాబితాలు విడుదల చేయలేదని పేర్కొన్నారు. మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్ చెప్పిన, అనుమతించిన జాబితాలను మాత్రమే ప్రజలు నమ్మాలని సూచించారు. ఆయా పథకాల కింద ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు మాత్రమే చదువుతున్నామని తెలిపారు. ఇవి ప్రభుత్వం ఆమోదించిన, తుది జాబితాలు కావని తెలిపారు. దరఖాస్తులు, కుటుంబ సర్వే ఆధారంగా అర్హత జాబితాను తయారు చేస్తామని తెలిపారు.



ఓగోడు పీహెచ్‌సీలో వైద్యురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

221 గ్రామసభలు, 47 వార్డు సభలు

నల్లగొండ : ప్రజాపాలన గ్రామసభల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లాలో 221 గ్రామసభలు, 47 మున్సిపల్ వార్డుసభలు నిర్వహించినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో మొత్తం 444 గ్రామసభలు, 95 మున్సిపల్ వార్డు సభలను నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం రేషన్‌కార్డుల కోసం 13,921, ఇందిరమ్మ ఇళ్ల కోసం 12,227, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 346, రైతు భరోసా కింద 288 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

నకిరేకల్: మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని ఏఆర్ కానిస్టేబుల్ భార్య బుధవారం నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రికి చెందిన మొగిలి సైదులుకు చిలుకూరు మండలం ఆచార్యులగూడేనికి చెందిన నాగమణితో 2011లో వివాహం జరిగింది. నల్లగొండలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సైదులు ప్రస్తుతం కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. సైదులు భార్యాపిల్లలను వదిలి నకిరేకల్‌లోని పటేల్ నగర్‌లో ఓ ఇంట్లో మరో మహిళతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న నాగమణి తన పుట్టింటి నుంచి బుధవారం పటేల్‌నగర్‌కు రాగా.. సైదులు మరో మహిళతో కలిసి ఉండటాన్ని చూసింది. కోపోద్రిక్తులైన సైదులు, మరో మహిళ కలిసి నాగమణిపై దాడి చేశారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

రేషన్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జున

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యం తరలింపు కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ నాగార్జున తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.. ఈ నెల 12న మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు టాటా ఏస్ వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ మచ్చ రవిని విచారించగా.. పోతుగంటి శ్రీనివాసరావు అలియాస్ పల్లి శ్రీను అనే వ్యక్తి బియ్యం లోడు చేసుకుని ఈదులగూడ చౌరస్తాలో వేచి ఉండాలని తనకు సూచించడంతో బియ్యం లోడుతో వెళ్తున్నట్లు తెలిపాడు. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసుకుని పోతుగంటి శ్రీనివాసరావుతో పాటు డ్రైవర్ మచ్చ రవిని అరెస్ట్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ డిపోను అగ్రస్థానంలో నిలపాలి

- ఆర్ఎం జానిరెడ్డి



ప్రోత్సాహకాలు అందుకున్న కార్మికులు, ఉద్యోగులతో ఆర్ఎం జానిరెడ్డి

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ డిపోను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్ స్థానంలో నిలపాలని ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన డిపో దేవరకొండ ఆర్టీసీ డిపో అన్నారు. ఉద్యోగులు, కార్మికుల కృషి ఫలితంగా సంక్రాంతి, ఇతర పండుగల సందర్భంలో డిపోను ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఎంఎఫ్ వెలుగు కృష్ణయ్య పాల్గొన్నారు.

జన్మతః పౌరసత్వం రద్దుపై ఆందోళన

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంపై మనోళ్ల ఆవేదన
- ఉద్యోగ రీత్యా ఉంటున్న వారికి గ్రీన్ కార్డు లభించేది కష్టమే..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ఆ దేశంలోని వలసదారులకు ఇబ్బంది కలిగేలా ఉన్నాయి. వలసదారులకు జన్మతః పౌరసత్వం రద్దుచేస్తామని ప్రకటించడంతో ఇక అక్కడి పౌరసత్వం అందనట్టేననే ఆందోళన మనోళ్లలో వ్యక్తమవుతోంది. ఈ అంశంపై అమెరికాలో గ్రీన్‌కార్డు కలిగి ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

వలసదారులకు ఇబ్బందులు



నల్లగొండ: మా స్వస్థలం నల్లగొండ పట్టణం. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో ఉంటున్నాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఆ దేశంలో ఉంటున్న వలసదారుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తారు. ఉద్యోగ రీత్యా అక్కడ ఉంటున్న భారతీయులకు పిల్లలు జన్మిస్తే వారు ఇంటర్ చదివే సందర్భంలో వీసా తీసుకోవాల్సి ఉంటుంది. అమెరికా జన్మతః పౌరసత్వం ఇవ్వదు. ప్రస్తుతం అమెరికా గ్రీన్ కార్డు రావాలంటే 15 ఏళ్ల సమయం పట్టవచ్చు.

– కంచరకుంట్ల వెంకటరాంరెడ్డి

భారతీయులపై కఠిన వైఖరి ఉండదు



మిర్యాలగూడ: మాది మిర్యాలగూడ పట్టణం. నేను న్యూజెర్సీకి వెళ్లి 23 సంవత్సరాలు దాటింది. నా ముగ్గురు పిల్లలు అక్కడే జన్మించారు. వారికి సిటిజన్‌షిప్ ఉంది. నాకు కూడా గ్రీన్‌కార్డు ఉంది. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో మెక్సికో, కెనడా, శరణార్థులు, వలసవాదులపై ప్రభావం పడనుంది. ఇప్పటికే సిటిజన్స్, గ్రీన్‌కార్డు ఉండేవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జన్మించబోయే పిల్లలకు ఆ దేశ పౌరసత్వం ఇవ్వకుండా అడ్డుకునే అవకాశాలు ఉండనున్నాయి.

– మహ్మద్ ఫరూక్‌ఖాన్

ఫిబ్రవరి 19 తర్వాతే నిర్ణయం



చౌటుప్పల్ : మాది యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అక్కంపల్లి గ్రామం. అమెరికాలోని న్యూయార్క్‌లోని ల్యాండ్‌ఐలాండ్‌లో ఉంటున్నాం. దేశానికి కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం కొంతమేరకు ఇబ్బందికరమే. ఫిబ్రవరి 19 వరకు గత ప్రభుత్వ నిర్ణయాలే ఉంటాయి. ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై అమెరికాలోని 22 రాష్ట్రాల చెందిన ప్రతినిధులు కోర్టుకు వెళ్లారు. ఆ కోర్టు తీర్పు వెలువడాల్సి ఉంది. లక్షలాది మందిపై ప్రభావం చూపే ట్రంపు నిర్ణయంపై కోర్టు తీర్పు ఆధారంగా నిర్ణయం ఉండనుంది. ఫిబ్రవరి 19 తర్వాత తీర్పు అమలు అయితే ప్రస్తుతం జన్మించిన పిల్లల భవితవ్యంపై ప్రభావం చూపనుంది.

– సుధాకర్‌రెడ్డి

ఇప్పటికే జన్మించిన వారికి ఇబ్బందిలేదు



కోదాడ: మాది సూర్యాపేట జిల్లా కోదాడ. అమెరికాలోని చికాగోలో ఉంటున్నాం. అమెరికాలో జన్మతః వచ్చే పౌరసత్వం రద్దు వల్ల ఇప్పటికే ఆ దేశంలో జన్మించిన పిల్లలకు ఇబ్బంది లేదు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అమెరికాలో ఉంటున్న ఇండియన్స్‌కు ఇది కొంత ఇబ్బందికరంగా మారవచ్చు. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు చట్టసభల్లో ఆమోదం పొందడం అంత సులువు కాదనే చర్చ ఇక్కడ జరుగుతుంది. ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి మరికొన్ని రోజులు వేచిచూడాలి.

– బొగ్గారపు మణిదీప్–నాగలక్ష్మి

భారతీయులకు ఇబ్బందికరం



నేరేడుచర్ల: మాది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంపు నిర్ణయాలు భారతీయులకు ఇబ్బందికరంగా మారనున్నాయి. అమెరికా పౌరసత్వం రద్దు వల్ల భారతీయులు ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే గ్రీన్ కార్డులు కలిగి ఉన్నవారు కోర్టులో కేసులు వేస్తున్నారు. అమెరికాలో జన్మతః పౌరసత్వం రద్దు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. దీనిపై కోర్టు తీసుకునే నిర్ణయంపై భారతీయులు భవిష్యత్ ఆధారపడి ఉంది.

– దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

ఆందోళన అవసరం లేదు



సాక్షి, యాదాద్రి: మాది యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండలం ఇక్కుర్తి. అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నాం. చట్టబద్ధంగా అమెరికా వచ్చిన తెలుగు ప్రజలు..అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎఫ్–1, హెచ్–1 బీ వీసాలతో ఇక్కడే స్థిర పడాలనుకునే వారికి ఇబ్బందే. ప్రస్తుతం గ్రీన్‌కార్డు పొందడం అంత సులువు కాదు. జన్మతః పౌరసత్వం రద్దు సాధ్యం కాకపోవచ్చు. ఇప్పటికే పౌరసత్వం లభించిన ఇండియన్స్‌కు ఇబ్బందులు ఉండవు.

– దొంతిరి శ్రీధర్‌రెడ్డి,

గ్రీన్ కార్డు రావడం కష్టమే..



నల్లగొండ: మాది నల్లగొండలోని సావర్కర్ నగర్. ప్రస్తుతం అమెరికాలోని ఆస్టిన్ టెక్సాస్‌లో ఉంటున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంతో ఆ దేశంలో గ్రీన్ కార్డు రావడం కష్టమే. గ్రీన్ కార్డు రావడానికి చాలా ఏళ్లు పట్టే అవకాశం ఉంది. గతంలో హెచ్1, ఎఫ్1, ఎల్1 వీసాలు వచ్చిన వారి పిల్లలకు పౌరసత్వం వచ్చేది. ప్రస్తుత అలాంటి అవకాశం లేదు. ఇప్పటికే అమెరికాకు ఉద్యోగాలు, చదువుల రీత్యా వచ్చి ఉంటున్న ఇండియన్స్‌కు గ్రీన్‌కార్డు రాలేదు. వారి పిల్లలకు కూడా పౌరసత్వం రావడం కష్టమే.

– శ్రీకాంత్

వేటు పడొచ్చు



నాగార్జునసాగర్: మాది తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాల గ్రామం. జార్జియాలో ఉంటున్నాం. కేవలం పౌరసత్వం కోసమే అమెరికాకు వలస వచ్చే వారిపై నూతన అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో వేటు పడవచ్చు. ట్యాక్స్ కట్టే వారికి సరైన వసతులు కల్పించేందుకే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేశారు. హెచ్–1 వీసాలతో ఉద్యోగం చేసేవారికి, గ్రీన్‌కార్డుతో వారి పిల్లలకు పౌరసత్వం ఇస్తుండవచ్చు.

– పిసికె వేణుకుమార్‌రెడ్డి

ఎఫ్ 1, హెచ్ 1 వీసాదారులకు నష్టం



నూతనకల్: మాది సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల. న్యూజెర్సీలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం వల్ల ఎఫ్–1, హెచ్–1 వీసాదారులకు నష్టం వాటిల్లుతుంది. ఫిబ్రవరి 24 వరకు జన్మించిన పిల్లలకు ఇబ్బందులు ఉండవు. గతంలో ఇలాంటి నిర్ణయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం అందించాలనే ఉత్తర్వులను జారీ చేసింది.

– బాణాల గోవర్ధన్‌రెడ్డి

వలసదారులపై ప్రభావం



మిర్యాలగూడ : మాది దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామం. అమెరికాలోని న్యూజెర్సీలో 25 ఏళ్ల క్రితమే స్థిరపడ్డాం. గ్రీన్‌కార్డు కూడా ఉంది. మా పిల్లలు కూడా సిటిజన్‌షిప్ కలిగి ఉన్నారు. ట్రంప్ నిర్ణయంతో భారతీయులపై ప్రభావం ఉండదని భావిస్తున్నాం. ట్రంప్ నిర్ణయం చట్టరూపం దాల్చాలంటే సెనేటర్ల మీదనే ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా భారతీయులకు కష్టకాలమే అనిపిస్తుంది.

– వాసు విశ్వనాథుల

బర్త్ టూరిజం ఆగిపోతుంది



నాగార్జునసాగర్: మాది పెద్దవూర మండల పులిచర్ల గ్రామం. నేను అమెరికాలోని నార్త్ కరోలినాలో సిర్థపడ్డాను. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారతీయులు ఆ దేశ పౌరసత్వం కోసం పిల్లలను ప్రసవించ డానికి వెళ్లేవారి (బర్త్ టూరిస్టుల)పై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం హెచ్1బి వీసాలపై ఉన్నవారికి ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ విడుదలైన క్షణం తర్వాత బిడ్డ పుడితే అమెరికా శాశ్వత పౌరసత్వం లభించదు. సరైన పత్రాలతో వచ్చిన ఇండియన్స్‌కు ధోకా ఉండదు.

– గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి

అక్రమ వలసదారులపైనే చర్యలు తీసుకోవాలి



అర్వపల్లి: మా స్వగ్రామం జాజిరెడ్డిగూడెం. అమెరికాలోని టెన్నెసిలో ఉంటున్నాం. ట్రంప్ ఆంక్షలతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. అక్రమంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప ఇప్పటికే భర్తలు చట్టబద్ధంగా వెళ్లి భార్యలు తాత్కాలిక వీసాలపై ఉంటూ జన్మించిన పిల్లలకు పౌరసత్వం కల్పించాలి.

– జన్నపు శ్రీదేవి

ఇప్పుడే ఏమీ చెప్పలేము



కోదాడ: మాది కోదాడ పట్టణం. అమెరికాలోని సియాటెల్‌లో ఉంటున్నాం. డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆర్డర్స్‌పై ఇప్పుడే ఏమి చెప్పలేం. ముఖ్యంగా ఇండియన్స్‌పై ఈ ప్రభావం ఎక్కువగా పడే అవకాశం ఉంది. ఆదేశాలలో కటాఫ్ విషయం, ఇప్పటికే పుట్టిన వారి విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. అమెరికా వ్యాప్తంగా ఇతర దేశాల నుంచి వలస వచ్చినవారు ఆందోళనలు చేపట్టే అవకాశం ఉంది.

– చర్లకోల అనురాగ్‌రెడ్డి–పావని

ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూడాలి



అర్వపల్లి: మాది జాజిరెడ్డిగూడెం. అమెరికాలోని హూస్టన్‌లో సిర్థపడ్డాం. ట్రంప్ నిర్ణయం వల్ల ఇప్పటి వరకు అమెరికాలో ఉంటూ పిల్లలు జన్మించిన వారికి ఏ ఇబ్బంది లేకుండా చూడాలి. కొత్తగా జారీ అయిన ఉత్తర్వుతో అక్కడ స్థిరపడిన వారికి ఇబ్బందులు ఏర్పడవద్దు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూడాలి.

– అలూరి బంగార్‌రెడ్డి

గత విధానాన్ని కొనసాగించాలి



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా మునగాల. అమెరికాలోని అట్లాంటాలో ఉంటున్నాం. అమెరికాలో జన్మతః వచ్చే పౌరసత్వం రద్దు తగదు. గత విధానాన్నే కొనసాగించాలి. అక్కడ జన్మించిన ప్రతి ఒక్కరికీ ఆ దేశ పౌరసత్వం కల్పించాలి. లేదంటే పిల్లలు వేరయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

– జూలకంటి లక్ష్మారెడ్డి

ఆందోళన కలిగించే నిర్ణయాలు



భువనగిరి: మాది వలిగొండ మండలం టేకుల సోమారం. అమెరికాలోని ఇండియానా పోలీస్‌లో ఉంటున్నాం. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ఇండియా ప్రజలకు కొంత ఆందోళనకరంగా ఉన్నాయి. జన్మతఃపౌరసత్వం రద్దుపై నిర్ణయం తీసుకున్నప్పటికీ దానిపై స్పష్టత లేదు. తాత్కాలిక వీసాతో అమెరికాకు వెళ్లిన వారికి మాత్రం ఇబ్బందులు తప్పవు.

– చింతల రాము

ఇండియన్స్‌పై ప్రభావం ఉండకపోవచ్చు




భువనగిరి: మాది భువనగిరి పట్టణం. న్యూయార్క్‌లో స్థిరపడ్డాం. ట్రంప్ తీసుకున్న జన్మతఃపౌరసత్వం రద్దు నిర్ణయంతో ఇండియా మీద అంతగా ప్రభావం ఉండకపోవచ్చు. చట్ట ప్రకారం వీసాతో వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ట్రంప్ తీసుకున్న నిర్ణయాల వల్ల ఇండియన్స్ అంతగా భయపడాల్సిన అవసరం లేదని అనుకుంటున్నాను.

– లక్ష్మీనర్సింహారెడ్డి

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

- మూడురోజుల పాటు ఉత్సవాలు
- ముస్తాబైన సైదన్న దర్గా



జాన్‌పహాడ్ దర్గా

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం నుంచి ప్రారంభంకానుంది. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి.

- గురువారం సూర్యోదయానికి ముందే బాబా(హజరత్ సయ్యద్ జాన్‌పాక్ షహీద్), (హజరత్ సయ్యద్ మొహినుద్దీన్ షహీద్) సమాధుల వద్ద కొవ్వొత్తులతో ఉల్సా నిర్వహించి ఉర్సు ప్రారంభిస్తారు.
- శుక్రవారం గంధం ఊరేగింపు చేపడతారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు గంధాన్ని దర్గా పరిధిలోని గ్రామాల్లో గుర్రంపై ఊరేగించి బాబా సమాధులకు సమర్పిస్తారు.
- శనివారం దీపారాధనతో ఉర్సు ముగుస్తుంది.

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టింది. పోలీసులు, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. **మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ డిపోల నుంచి దర్గాకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.** తాగు నీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వారు ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. శూన్యపహాడ్, పాలకవీడు మార్గాల నుంచి వచ్చే వాహనాలను రెండు రోజులపాటు దర్గా ప్రాంతంలోకి అనుమతించరు. గంధం ఊరేగింపునకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఇతర మంత్రులు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సహకారం

జాన్‌పహాడ్ ఉర్సుకు ప్రతీ ఏటా డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వారు తమ సహకారం అందిస్తున్నారు. ఈసారి రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు సోలార్ లైటింగ్, బయో టాయిలెట్స్, నీటి సరఫరా ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు తెలిపారు.

540 మంది పోలీసులతో బందోబస్తు

జాన్‌పహాడ్ ఉర్సుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. బుధవారం ఆయన దర్గా వద్ద పార్కింగ్ స్థలాలు, క్యూలైన్, హెలిప్యాడ్‌ను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. శుక్రవారం గంధం ఊరేగింపు సందర్భంగా 540 మంది పోలీస్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్గా పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 40 సీసీ కెమెరాలతో నిఘా కొనసాగుతుందన్నారు. డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో 8 మంది సీఐలు, 27 మంది ఎస్ఐలు, 4 స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని వక్ఫ్ బోర్డు అధికారులకు సూచించారు.



పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

గంజాయికి బానిసై చోరీలు చేస్తున్న యువకుల అరెస్ట్

- 1.600 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: గంజాయికి బానిసలై బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్ సమీపంలో గల జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న లింగగల్ల పూర్ణచంద్, హరిజన్ మహేష్, నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని బీటీఎస్ సమీపంలో ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డులో ఉంటున్న కానుకుంట్ల జగదీశ్ గంజాయికి బానిసలయ్యారు. సులభంగా డబ్బులు సంపాదించడానికి హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసులు మిర్యాలగూడ రోడ్డులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. వీరు ముగ్గురు ఈ నెల 16వ తేదీ రాత్రి కలెక్టరేట్ సమీపంలోని జిరాక్స్ సెంటర్ వద్ద దొంగిలించిన బైక్‌పై అటుగా వచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన వీరికి పోలీసులు ఆపి విచారించగా.. హైదరాబాద్‌లోని బాలానగర్‌లో 2 కిలోల గంజాయి కొనుగోలు చేసి కొంత వారు తాగి మిగిలిన గంజాయిని అమ్మేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 1.600 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డితో పాటు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ జె. సైదులు, పోలీస్ సిబ్బంది కృష్ణానాయక్, ఇంద్రారెడ్డి, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి



మల్లయ్య (ఫైల్)

శాలిగౌరారం: ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య(53) హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన మల్లయ్యకు అదే గ్రామానికి చెందిన రుద్రారం యాదయ్య, రుద్రారం మల్లేశ్, రుద్రారం చినయాదయ్యకు గత కొంతకాలంగా వ్యక్తిగత గొడవలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు బైక్‌పై వెళ్తున్న మల్లయ్యపై యాదయ్య, మల్లేశ్, చిన యాదయ్యతో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మల్లయ్యను హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య చంద్రలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

త్రిపురారం: అనారోగ్య సమస్యలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడమనూరు మండలం బంటువారిగూడెంలో బుధవారం జరిగింది. బంటువారిగూడేనికి చెందిన బిల్లకంటి వెంకన్న(50) వంట మనిషిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వెంకన్న దవడకు ఇన్‌ఫెక్షన్ వల్ల ఆపరేషన్ జరిగింది. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడడతో ఎడమ కాలుకు సైతం ఆపరేషన్ జరిగింది. అనారోగ్య సమస్యలు అధికం కావడంతో మనస్తాపానికి గురైన వెంకన్న మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం వద్ద చెట్టుకు ఉరేసుకుని కూలీలకు కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్ నిర్లక్ష్యంతోనే కేంద్రం చేతుల్లోకి సాగర్

- కేసీఆర్ పేరు చెరిపేయాలని భూములు ఎండబెడుతున్నారు
- పథకాలు రాకపోతే మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీయండి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట: సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్ర బలగాల చేతిలోకి వెళ్లిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆమె బుధవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం భువనగిరి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా రాష్ట్ర ప్రజలకు సాగునీరందని దుస్థితి నెలకొందన్నారు. మన అధికారులు డ్యాం వద్దకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలన్న కాంగ్రెస్ వైఖరి వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు కింద 3.30లక్షలు, సాగర్ ప్రాజెక్టు కింద 1.20లక్షల ఎకరాల్లో పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. పథకాలు రాకపోతే గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు తమ పాలనలో ఒక్క మెడికల్ కళాశాలనైనా జిల్లాకు తెచ్చారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ ఆఫీసులపై దాడులకు దిగుతున్నారని అన్నారు. తమ వద్ద 60లక్షల సైన్యం ఉందని తాము రంగంలోకి దిగితే తట్టుకోలేరని హెచ్చరించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని కొండపై ఆమె మాట్లాడుతూ.. లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం టెంపుల్ సిటీ ఆఫ్ నేషన్ అని అభివర్ణించారు. యాదగిరి క్షేత్రాన్ని కేసీఆర్ అద్భుతంగా పునఃనిర్మించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా కేసీఆర్ తరహాలో అభివృద్ధి చేయాలన్నారు. ఈట భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిషోర్, బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, గొంగిడి మహేందర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, ఏవీ కిరణ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు, యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీ తదితరులు ఉన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టపై లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా జరిగింది. వైకుంఠ ద్వారం వద్ద ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, నవీన్‌కుమార్ రెడ్డి, ఈట భాస్కర్‌రావు కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. అంతకుముందు ఆలయ ముఖ మండపంలో శతఘటాభిషేకం జరిపించారు. అనంతరం భక్తులకు రూ.150 క్యూలైన్ మార్గంతో స్వామివారి దర్శనం కల్పించారు. క్యూలైన్‌లో పలువురు భక్తులు అస్వస్థతకు గురై ఇబ్బందులు పడ్డారు. వెంటనే అధికారులు అప్రమత్తమై భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు